

నేడు అండర్-7, 9, 11 బాలబాలికల చెస్ పోటీలు

సుభాష్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): అండర్-7, 9, 11 జిల్లాస్థాయి బాలబాలికల పోటీలు బుధవారం నిర్వహించనున్నామని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అభ్యాస పాఠశాలలో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-7 క్రీడాకారులు 1-1-2018, అండర్-9 క్రీడాకారులు 1-1-2016, అండర్-11 క్రీడాకారులు 1-1-2014 తర్వాత జన్మించిన వారు ఉండాలన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాన్ని వెంటతెచ్చుకోవాలన్నారు. మిగతా వివరాల కోసం 9440007004 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఖరీఫ్ సీజన్‌కు నాణ్యమైన విత్తనాలను మార్కెట్‌లో విక్రయించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ శాఖ, తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వానాకాలం 2025కు సంబంధించి విత్తన డీలర్లతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. వరి వంగడాలైన బీపీటీ 5204, కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 వరి విత్తనాలు వివిధ రకాల పరిమాణాలలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. డీలర్లకు 6 శాతం సర్వీస్ చార్జీలు ఇస్తామని, 2 టన్నుల వరకు విత్తనాలను కొన్న రైతులకు మేలు చేసే విధంగా ఇంటి వద్దకే 6 శాతం డిస్కౌంట్ ఇస్తూ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ సీడ్స్ విత్తనాలను రైతులకు అందిస్తే అధిక దిగుబడులు వస్తాయని రైతులకు కూడా నమ్మకం రెట్టింపు అవుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, విత్తన డీలర్లు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన విత్తన డీలర్లు

ఎంఎల్‌హెచ్‌పీలకు బ్రిడ్జి కోర్సు ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో నూతనంగా నియామకం జరిగిన ఎంఎల్‌హెచ్‌పీలకు మూడు నెలల బ్రిడ్జి కోర్సును మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని రాజశ్రీ ప్రారంభించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలకు వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, మాతా శిశు సంరక్షణ, జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం, జీవనశైలి వ్యాధులు, ప్రజారోగ్య పరిరక్షణ, ఆరోగ్య కార్య క్రమాల ఆన్‌లైన్ ఎంట్రీ, పీసీపీఎన్‌డీటీ, జాతీయ ఆరోగ్య మిషన్ అంశాలపై మూడు నెలల శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని ఈ శిక్షణలో ఉమ్మడి జిల్లాకు చెందిన నిజామాబాద్, కామారెడ్డిలోని ఎంఎల్‌హెచ్‌పీలను ఎంపిక చేశామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నామని ఎంపికైన వారు క్రమం తప్పకుండా హాజరై వివిధ ఆరోగ్య అంశాల్లో నైపుణ్యతను సాధించి ప్రజారోగ్య పరిరక్షణకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ రాజు, డీహెచ్ఈ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



● సన్నగా నీటిని పోస్తున్న బోరుమోటార్

పాతాళానికి భూగర్భ జలాలు!

- జిల్లాలో భారీగా తగ్గిపోయిన భూగర్భ జల మట్టాలు
- జిల్లాలో సరాసరి 14.01 మీటర్ల లోతులో నీళ్లు
- కొన్ని మండలాల పరిధిలో 20 మీటర్ల లోతులోపు పడిపోయిన మట్టాలు
- ఇంకుడు గుంతలు, ఫారం పాండ్‌లు నిర్మించుకోవాలంటున్న అధికారులు

నిజామాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఠారెత్తిస్తున్న ఎండలతో భూగర్భ జలమట్టం పడిపోవడం గుబులు పుట్టిస్తోంది. వేసవి ప్రారంభం నుంచే భూగర్భజలాలు పాతాళానికి పడిపోవడం ఆం దోళన రేపుతోంది. ఎండల తీవ్రత పెరగడం.. నీటి వినియోగం అధికం కావడంతో ఆ ప్రభావం భూగర్భ జల మట్టాలపై పడింది. జిల్లాలో సరాసరి భూగర్భ జలమట్టాలు 14మీటర్లకు చేరుకోగా కొన్ని మండలాల పరిధిలో గుట్టలు ఉండటం.. బోర్లు ఎక్కువగా వినియోగించడం వల్ల 20మీటర్లకు పైగా పడిపోయాయి. వ్యవసాయంతో పాటు ఇతర అవస రాలకు భూగర్భ జలమట్టాలపై ఆధార పడటంతో ఎక్కువ మొత్తంలో నీళ్ల తగ్గిపోయాయి. చెరువులు, వాగులు ఎండిపోవడం వల్ల కూడా నీటి మట్టాలు భారీగా పడిపోయాయి. వ్యవసాయ పనులు తగ్గినా.. జూన్‌లో వర్షాలు పడేంతవరకు మరింత తగ్గే అవకాశం ఉందని భూగర్భ జల వనరుల శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. భూగర్భ జలాలను పొదుపుగా వాడుకోవడంతో పాటు వర్షాలు పడినప్పుడు నీటిని నిలువ ఉంచే విధంగా ఇంకుడు గుంతలను ఎక్కువగా ప్రోత్సహించాలని కోరుతున్నారు.

జనవరి నుంచి ఏప్రిల్ వరకు బోర్ల వినియోగం

జిల్లాలో ఎండలు పెరగడం వ్యవసాయాని కి నీటిని ఎక్కువగా వినియోగించడం వల్ల భూగర్భ జల మట్టాలు భారీగా పడిపోయా యి. జిల్లాలో వ్యవసాయానికి జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఎక్కువగా బోర్లను వినియోగిం చడం వల్ల ఆ ప్రభావం జలమట్టాలపై పడిం ది. జిల్లాలోని ఎంపిక చేసిన 82 గ్రామాల పరిధిలో భూగర్భ జలశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ఏప్రిల్ నెలలో సాంపిల్ సేకరించగా నీటిమట్టాల తగ్గుదల బయట పడింది. గత జనవరితో పోల్చుకుంటే జిల్లాలో సరాసరి సగటున 3.92 మీటర్లు ఎక్కువగా నీటి మట్టాలు పడిపోయాయి. ఏప్రిల్‌లో తీసిన సాంపిల్ సర్వే వివరాల ప్రకారం జిల్లాలో సరాసరి భూగర్భజలమట్టాలు 14.01 మీటర్లలోతులో ఉన్నాయి. కొన్ని మండలాల పరిధిలో అంతకుమించి ఎక్కువ లోతులో నీటిమట్టాలు ఉన్నాయి. జిల్లాలో సాంపిళ్లు సేకరించిన గ్రామాల్లో 10 మీటర్లలోపు 29 బోరు బావులు ఉండగా 10 నుంచి 20 మీట ర్లలోపు నీటిమట్టాలు 39 బోరుబావులు ఉన్నా యి. జిల్లాలో 14 బోరుబావుల్లో 20 మీటర్లకు పైగా లోతులో నీటిమట్టాలు ఉన్నట్లు బయట పడ్డాయి. జిల్లాలో 35 శాతం విస్తీర్ణంలో 10 మీటర్లలోతు కంటే తక్కువ లోతులో నీళ్లు ఉండగా 48 శాతం విస్తీర్ణంలో 10నుంచి 20 మీటర్లలోతులో నీళ్లు ఉన్నాయి. జిల్లాలో 17 శాతం విస్తీర్ణంలో 20 మీటర్ల కంటే ఎక్కువ లోతులో నీళ్లు ఉన్నట్లు సర్వేలో తేలింది. జిల్లాలో గత జనవరిలో సరాసరి 10.09 మీట ర్లలో నీటి మట్టాలు ఉండగా ఏప్రిల్ చివరి నాటికి 14.01 మీటర్ల లోతుకు చేరాయి. కేవలం మూడు నెలల్లోనే 3.92 మీటర్లలో తుకు ఎక్కువగా నీళ్లు వెళ్లాయి. జిల్లాలో గత సంవత్సరం సరాసరి వర్షపాతం కంటే 14.8 శాతం అత్యధికంగా వర్షం పడిన అక్టోబరు నుంచి మళ్లీ వర్షాలు పడకపోవడం వల్ల ఈ పరిస్థితి ఎదురైంది. జిల్లాలోని భీంగల్, నవీపేట్, డిచ్‌పల్లి, మోపాల్, సిరికొండ, ధర్పల్లితో పాటు మరికొన్ని మండలాల పరిధిలోని కొన్ని గ్రామాల్లో 20 మీటర్లకు పైగా లోతులో నీళ్లు ఉన్నాయి. వేసవికాలం అయినందున ఈ సమయంలోనే ప్రతి ఇంట్లో, పొలాలు, చేనుల వద్ద ఇంకుడు గుంతలు, ఫారం పాండ్‌లను నిర్మించుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని ఆ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మరో నెలన్నర రోజులు ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల మరింత లోతులోకి నీళ్లు వెళ్లే పరిస్థితి ఉందని వారు అంచనా వేస్తున్నారు. గ్రామాలు, పట్టణ పరిధిలోని ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరుతున్నారు. జిల్లాలో వ్యవసాయంతో పాటు ఇతర అవస రాలకు నీటిని ఎక్కువగా వినియోగించడం వల్ల భూగర్భ జలాలు భారీగా తగ్గిపోయాయని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌బాబు తెలిపారు. జిల్లాలో బోర్లు ఎక్కువగా ఉండటం వాటి వినియోగం పెరగడం వల్ల ఈ పరిస్థితి ఎదురైందని ఆయన తెలిపారు. రైతులు, ప్రజలు ఎక్కువగా ఇంకుడు గుంతలు, ఫారం పాండ్‌లను నిర్మించుకుంటే భూగర్భ జలాలు ఎక్కువగా ఉంటాయని ఆయన తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లో వీటిని ఎక్కువగా నిర్మించుకోవాలని ఆయన కోరారు.

8న జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 8న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్ కంపెనీల ఆధ్వర్యంలో ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, అడ్వైజర్, క్యాషియర్, ఫ్లోర్ సూపర్‌వైజర్, రిలేషన్‌షిప్ మేనేజర్, ఎగ్జిక్యూటీవ్ ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఫార్మసీ విత్ పీసీఐ, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్ విద్యార్హతలు కలిగిన వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని ఉద్యోగానికి ఎంపికైన వారు మోర్తాడ్, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్, హైదరాబాద్, తెలంగాణలోని ఏ ప్రాంతంలోనైనా పనిచేయవల్సి ఉంటుందని అభ్యర్థులు శివాజీనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి జాబ్‌మేళాలో పాల్గొనాలన్నారు. వివరాలకు 9948748428, 9959456793 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన



ఇంద్రజాల ప్రదర్శన దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బాల్‌భవన్‌లో విద్యార్థులకు ఆటవిడుపులో భాగంగా మంగళవారం నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఇంద్రజాలకుడు జాదురంగనాథ్ తన ప్రదర్శనలో థమ్సప్, చాక్లెట్లు, కూల్ డ్రింక్ వంటి వాటితో చేసిన ప్రదర్శన చిన్నారులను ఆకర్షింపజేసింది. అనంతరం ఇన్‌చార్జి బాల్‌భవన్ సూపరింటెండెంట్ ఉమాబాల, మాజీ సూపరింటెండెంట్ విఠల్ ప్రభాకర్ జాదురంగనాథ్‌ను ఘనంగా సత్కరించారు.



ఇందిరమ్మ ఇళ్లకు రుణాలు!

- జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మహిళా గ్రూపు సభ్యులకు రుణాలు ఇప్పించేందుకు ఏర్పాట్లు
- ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు రూ.50వేల వరకు బ్యాంకుల ద్వారా రుణం
- మొదటి విడత వారిని గుర్తిస్తూ ఇళ్ల నిర్మాణం కోసం ఏర్పాట్లు

ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నిజామాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు లబ్ధిదారులకు మహిళా గ్రూపుల నుంచి రుణం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇళ్లు మంజూరైనా నిర్మాణం నిధులు లేక చేపట్టని వారిని గుర్తించి ఈ రుణం అందించనున్నారు. బ్యాంకుల ద్వారా రూ.50వేల వరకు రుణాన్ని ఇచ్చి ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల ఆధ్వర్యంలో గ్రామాలలో మహిళా సభ్యులను గుర్తించి ఇళ్ల నిర్మాణానికి చేయూతనివ్వనున్నారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్లను నిర్మాణం చేపట్టే విధంగా వీరు ప్రయత్నాలు చేయనున్నారు. రెండో విడత ఇళ్లు కూడా ఈ నెల 12న లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తుండటంతో ఆలోపే మొదటి విడత లబ్ధిదారులకు ఈ చేయూతను అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మొదటి విడతలో మంజూరైన కొంత మంది కావాల్సిన డబ్బులు లేక నిర్మాణం చేపట్టడం లేదు. మహిళా గ్రూపుల నుంచి ఈ రుణం అందిస్తే నిర్మాణం చేపడతారని భావించిన అధికారులు ఈ ప్రయత్నాలు చేస్తున్నారు. బేస్‌మెంట్ వరకు ఇళ్ల నిర్మాణం జరిగితే తర్వాత విడతల వారీగా నిధులు విడుదల కానుండటంతో జిల్లాలో అన్ని ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

నియోజకవర్గానికి 3500 ఇళ్ల మంజూరు

ప్రభుత్వం జిల్లాలో నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేసింది. మొదటి విడత కింద ప్రతీ మండలం నుంచి ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 2762 ఇళ్లను మంజూరు చేశారు. లబ్ధిదారులను ఎంపిక చేసిన తర్వాత కూడా అర్హులైన వారు ఈ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం ఒక్కోక్క ఇళ్లకు 5లక్షల రూపాయలు మంజూరు చేయడంతో పాటు ఐదు విడతల్లో అందించేందుకు ఏర్పాట్లను చేసింది. ఈ ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను కూడా ఉచితంగానే అందిస్తుంది. మొదటి విడత కింద ఇప్పటి వరకు మంజూరైన ఇళ్లలో 1150 ఇళ్లకు ముగ్గులు పోశారు. వీరిలో 210 మంది మాత్రమే బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేపట్టారు. ముగ్గులు పోసిన వారు కూడా పూర్తిస్థాయిలో ఇళ్లను నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణానికి 600అడుగుల వరకు నిర్మించుకోవచ్చని అనుమతులను ఇచ్చారు. ఇప్పటి వరకు బేస్‌మెంట్ వేసిన 95 మందికి లక్ష రూపాయల చొప్పున నిధులను మంజూరు చేశారు. ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరైతే ఐదు విడతల్లో 5లక్షల రూపాయలను అందిస్తారు. మొదటి విడత కింద బేస్‌మెంట్ పూర్తయితే అధికారులు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే వారి ఖాతాల్లో డబ్బులను జమ చేస్తారు. అదే రీతిలో గోడలు, స్లాబ్, ఇతర నిర్మాణాలు పూర్తిచేసిన తర్వాత విడతల వారీగా ఈ నిధులను వారి ఖాతాల్లో జమ చేస్తారు. మొదటి విడతలో ఇప్పటికి సగం ఇళ్లు కూడా నిర్మాణం చేపట్టకపోవడంతో అధికారులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. రెండో విడత కింద కూడా మిగతా ఇళ్లను మంజూరు చేసేందుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేసినందున మొదటి విడత 31 గ్రామాలకు మంజూరు చేసిన ఇళ్లను మినహాయించి మిగతా ఇళ్లను మంజూరు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అర్హులను గుర్తించిన వారు క్రాస్ చెక్ చేస్తూ ఈనెల 12న రెండోవిడత జాబితాను గ్రామాల వారీగా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారుల పరిశీలన

జిల్లాలో ఇళ్లను మంజూరు చేసినా నిర్మాణం చేపట్టకపోవడంతో వాస్తవ పరిస్థితులను గ్రామాల వారీగా పరిశీలించారు. లబ్ధిదారులు పేదలు కావడం, నిర్మాణం చేపట్టేందుకు తమ వద్ద డబ్బులు లేకపోవడం వల్ల ముగ్గులు పోసిన పనులను చేపట్టడం లేదు.

మిగతా 8వ పేజీలో...

హనుమాన్ ఆలయ స్థలాన్ని పరిరక్షించాలి

● ఆర్‌డీవో కార్యాలయం ఎదుట పరిరక్షణ కమిటీ ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యో తి): నగరంలోని ఆటోనగర్‌లోగల హనుమాన్ మందిర స్థలాలను పరిరక్షించాలని కోరుతూ ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆటోనగర్ అర్సావల్లిలోగల హనుమాన్ దేవాలయ స్థలం కోసం 15ఏళ్లుగా పోరాడుతున్నా.. ప్రభుత్వం హనుమాన్ మందిరానికి కేటాయించడం లేదని అన్నారు. ఎండోమెంట్ అధికారులు హనుమాన్ మందిరంపై దృష్టిసారించి ఆలయ భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిషన్, సూర్యరెడ్డి, మధు, రమణాచారి, రమేష్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్ చారి, రాజేశ్వర్, శంకర్, తులసీదాస్, దిలీప్, గంగాధర్ పాల్గొన్నారు.





మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పల చుట్టూ చేరిన నీటిని తొలగిస్తున్న రైతులు

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- మార్కెట్ యార్డులో నీళ్లు నిలువడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్

నిజామాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో అకాల వర్షం రైతులను కష్టాల్లోకి నెట్టింది. రాత్రి పూట పడిన వర్షం ధాన్యాన్ని తడిసి ముద్దచేసింది. కొనుగోలు కేంద్రాలకు అమ్మేందుకు తీసుకువచ్చిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. కొనుగోళ్ల ఆలస్యం కావడం కొన్న ధాన్యం తరలించకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఎదురైందని వారు ఆరోపిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు పట్టించుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. తడిసిపోయిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు తిప్పలు పడుతున్నారు.

తడిసిన ఆరబోసిన ధాన్యం

జిల్లాలో సోమవారం రాత్రి పడిన వర్షం రైతులను అతలాకుతలం చేసింది. నిజామాబాద్ నగరం, నిజామాబాద్ రూరల్, మోపాల్, ఆర్మూర్, మాక్లూర్, నవీపేటతో పాటు ఇతర మండలాల పరిధిలో ఈ వర్షం పడింది. అకాలంగా ఉరుములు మెరుపులతో పడిన వర్షం వల్ల ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. అమ్మకానికి తీసుకువచ్చిన ధాన్యం తడిచిపోవడంతో ఆరబెట్టేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు ఆలస్యం చేయడం వల్ల ఈ పరిస్థితి ఎదురైందని వాపోతున్నారు. నిజామాబాద్ నగరం పరిధిలో భారీగా వర్షం పడటంతో మార్కెట్ యార్డుకు తీసుకువచ్చిన ధాన్యం భారీగా తడిచిపోయింది. మంగళవారం ఉదయం వరకు వర్షపునీరు ఉండటంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీటిలో ఉన్న ధాన్యాన్ని పక్కకు పోసి ఆరబెట్టారు. మార్కెట్ యార్డుకు తీసుకువచ్చిన ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడం వల్లనే ఈ పరిస్థితి ఎదురైందని వారు వాపోయారు. జిల్లాలోని మోపాల్, మాక్లూర్, ఆర్మూర్ మండలాల పరిధిలో ఇదే పరిస్థితి ఉంది. మోపాల్ మండలం పరిధిలోని న్యాల్‌కల్, సిర్పూర్, ముదక్‌పల్లి గ్రామాల పరిధిలో రోడ్లతో పాటు కల్లాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు త్వరగా చేస్తే తమకు ఇబ్బంది ఉండేది కాదని రైతులు వాపోయారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కూడా తరలించకపోవడం వల్ల తడిసిపోయింది. లారీలు, వాహనాల కొరతల వల్ల తరలింపు ఆలస్యం కావడంతో ధాన్యం తడవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.





● మార్కెట్ యార్డ్‌లో తడిసిన ధాన్యం

వారం క్రితం ధాన్యాన్ని తెచ్చాను..

: రాజు, ముబారక్‌నగర్ రైతు



వారం రోజుల క్రితం మార్కెట్ యా ర్డుకు ధాన్యాన్ని తీసుకువచ్చా. తూకం వేసే సమయంలో వర్షం రావడంతో ధాన్యం అంతా తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెడిదే కానీ కొనే పరిస్థితి లేదు. ఈ వర్షం వల్ల ఇంకా మూడు రోజుల వరకు మార్కెట్‌లో ఉండే పరిస్థితి ఏర్పడింది.

లారీల కొరతతో తరలింపు ఆలస్యం..

: శంకర్, న్యాల్‌కల్ రైతు



నాలుగు రోజుల క్రితం ధాన్యాన్ని తూకం వేశారు. లారీల కొరతతో తరలింపు ఆలస్యమైంది. అకాల వర్షం వల్ల ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన విధంగానే మిల్లుకు తరలించాలి. మళ్లీ వర్షానికి తడవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



తెలంగాణ సీడ్ సంస్థ విత్తనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అన్వేష్‌రెడ్డి

భీమ్‌గల్‌రూరల్ , మే6(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు నాణ్యమైన వరివిత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని,నకిలీ విత్తనాలు కొని మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సూచించారు. మంగళవారం ముచ్కుర్ గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ప్రాంతీయవరి, చెరకుపరిశోధన స్థానం రుద్రూర్ ఆధ్వర్యంలో పలుఅంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు తక్కువ యూరియా వాడి, సాగు ఖర్చు తగ్గించుకోవాలని, అలాగే అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. ఫర్టిలైజర్స్ యజమానులు నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు చేయించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆకుల దినేష్ కుమార్, శ్రీలత, ఏడీఏ సాయికృష్ణ, ఏవో లావణ్య, ఏఈవోలు అరవింద్, మౌనిక, భార్గవ్, దివ్య గ్రామ అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

జల్లాపల్లి ఆబాదిలో తాగునీటి సమస్య



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కోటగిరి,మే6(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాది గ్రామంలో గత మూడు రోజులుగా తాగునీటి సమస్య తలెత్తింది. గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా నెల రోజుల నుంచి నిలిచిపోవడంతో తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. దీంతో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. గ్రామంలో మిషన్ భగీరథ నీటికి తోడు సింగిల్ ఫేజ్, త్రిఫేజ్ మోటార్లతో నీటి సరఫరా కొనసాగుతుంది. మిషన్ భగీరథ నీరు నిలిచిపోవడంతో సరిపడ నీటి సరఫరా జరగడం లేదని మహిళలు తెలిపారు.సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బోధన్‌రూరల్,మే6(ఆంధ్రజ్యోతి): ప్రజలు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని బోధన్ టౌన్-2 సెక్షన్ పరిధిలోని సాలంపాడ్, మందర్నా గ్రామాల ప్రజలకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఏడీఈ నగేష్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు, మూగజీవాలకు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రాణాలు కోల్పోకుండా జీరో ప్రమాదాల కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా సిబ్బంది అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, లైన్ క్లియన్ తీసుకునేటప్పుడు ఎల్‌సీ ఆఫ్ ద్వారా సబ్ స్టేషన్‌లలో పని చేస్తున్న ఎర్త్ డిశ్చార్జ్, సెఫ్టీ జాకెట్లు ధరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏఈ-2 డేవిడ్, ఫోర్‌మెన్ గఫర్, లైన్ ఇన్‌స్పెక్టర్ గంగాకిషన్, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ రెంజల్ అధ్యక్షుడిగా క్యాతం యోగేష్



యోగేష్

రెంజల్,మే6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రెంజల్ మండల నూతన అధ్యక్షుడిగా నీలా గ్రామానికి చెందిన బీజేవైఎం నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ క్యాతం యోగేష్‌ను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి తెలిపారు. బీజేపీ రెంజల్ మండల అధ్యక్షుడిగా నియమించినందుకు జిల్లా కార్యవర్గానికి, ఎంపీ అరవింద్, మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డిలకు సదా రుణపడి ఉంటానని, పార్టీని మండలంలో మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని యోగేష్ తెలిపారు.

పట్టింపు లేని పల్లె ప్రకృతి వనాలు

నసురుల్లాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): నస్రుల్లాబాద్ మండలంలో గల నాచుపల్లి తండా, బొమ్మన్ దేవ్ పల్లి పల్లె ప్రకృతి వనాలను అధికారులు పట్టించుకోక పోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. వేసవిలో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి పల్లె ప్రకృతి వనలకు వెళ్దామంటే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది.. పల్లె ప్రకృతి వనాలలో మొక్కలు ఎండిపోయి ఉండడంతో ప్రకృతి వనం కాస్త అడవిలో పెరిగిన చెట్ల లాగా దర్శనమిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలను పల్లెలో పార్కు లాగా మారిస్తే వేసవిలో ప్రజలకు ఉపశమనం లభిస్తుంది.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

రామారెడ్డి, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రామారెడ్డి మండల ప్రత్యేక అధికారి డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా యూత్ స్పోర్ట్స్ అధికారి జగన్నాథం, రామారెడ్డి తహశీల్దార్ ఉమలత, ఎస్సైలు రాజారాం, నవీన్ చంద్ర, ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి, ఎంఈఓ నిట్టపు ఆనంద్ రావు, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ రవికాంత్, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, పిఇటిలు, యువకులు, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్సీ వెంకట్

నందిపేట్, మే 6(ఆంధ్రజ్యోతి): నందిపేట్ మండలం ఖుదావన్‌పూర్‌లో సీఎం కప్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రాష్ట్ర ఉర్దూ అకాడామిక్ చైర్మన్ తహెర్ హుందాన్, ఆర్మూర్ నియోజవకర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, యువజన కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్, నందిపేట్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ హరీష్, ఏఎంసీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, పంచరెడ్డి చరణ్, డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, విప్పుల్‌గౌడ్, తోట మహేష్, మంగళారం చిరంజీవి, శశి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

నాగిరెడ్డిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వదల్ పర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ఇండ్లు లేని వారికి, అర్హులైన వారికి మంజూరు చేయాలని మంగళవారం గ్రామస్తులు స్థానిక ఎంపీడీవో ప్రభాకర్ చారికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పూరి గుడిసెలున్న వారికి, సొంత ఇల్లు లేని నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని వారు కోరారు. ప్రస్తుతం జారీ చేసిన ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలో ఇండ్లున్నవారికి కేటాయించారని వారు తెలిపారు. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ గౌడ్, సిద్ధిరాములు, లక్ష్మీనారాయణ, రామయ్య, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్,మే6(ఆంధ్రజ్యోతి): శ్రీ కోదండ రాముడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్మించిన రెండు అదనపు గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయాన్ని అభివృద్ధి చేసే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. రామాలయ అభివృద్ధి కొరకు రూ.10లక్షల మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరు అయురారోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, రామాలయ కమిటీ చైర్మన్, నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదినారాయణ, అరికెల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● పార్టీలో పని చేసిన వారికే గుర్తింపు

ఎడపల్లి: పార్టీ అభ్యున్నతికి పని చేసిన వారికి ఎల్లప్పుడూ పార్టీ గుర్తు పెట్టుకుని వారి అభివృద్ధికి పాటు పడుతుందని బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎడపల్లి మండలంలోని సాటాపూర్ గేటువద్ద గల డిఎం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ దిశా నిర్దేశం ప్రకారం పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని గుర్తు పెట్టుకుని పార్టీ వారికి పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో అందరూ కలిసి పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెలుతుందన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. అర్హులైన ఇండ్లు లేని వారికే ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని ఆయన అన్నారు. పథకాలు పక్కదారి పట్టకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాల న్నారు. త్వరలోనే గ్రామ స్థాయి, మండల స్థాయి, నియోజక వర్గ స్థాయిలో పార్టీ బలోపేతం చేయడానికి పార్టీ గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ గ్రామంలో, మండలంలో, నియోజకవర్గంలో ఏర్పాటు చేయబోయే కమిటీలో ఆసక్తి కలిగిన అన్ని వర్గాల వారు 5 గురు చొప్పున తమ వివరాలను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, గిరిజన సంక్షేమ శాఖ చైర్మన్ తిరుపతి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ గంగా శంకర్, నాయకులు గడుగు గంగాధర్, అరికెల నర్సారెడ్డి, నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరలు ఉన్నారు.

విదేశీ అక్రమ వలసదారులను వారి దేశాలకు పంపించాలి



బోధన్ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

● బోధన్ సబ్ కలెక్టర్‌కు వినతి

బోధన్‌రూరల్,మే6(ఆంధ్రజ్యోతి): విదేశీ అక్రమ వలసదారులను వెంటనే వారి వారి దేశాలకు పంపించాలని బోధన్ బీజేపీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్ అన్నారు. మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉగ్రవాది తర్వాత దేశంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఏ ఒక్క పాకిస్థాన్, బంగ్లాదేశ్, మహెన్‌మార్ ముస్లింలు ఉండకూదని కేంద్రహోంశాఖ నిర్ణయించడం జరిగిందన్నారు. మన బోధన్‌లో కూడా గతంలో జరిగిన పరిమాణాలు దృష్టిలో ఉంచుకుని పాకిస్థాన్, బంగ్లాదేశ్, మహెన్‌మార్ రోహింగ్యాలు ఉండే ఆస్కారం ఉందన్నారు. అధికారులు కార్డన్ సెర్చ్ రూపంలో మైనారిటీ కాలనీల్లో జల్లెడ పట్టాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. గతంలో ఒకే ఇంటి నెంబర్‌పై 40పాస్‌పోర్టులు జారీ అయిన విషయం గమనార్హం. బోధన్ ప్రాంతంలో సోదాలు నిర్వహించి మదర్సాలలో, సమస్యాత్మక ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ చేసి ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు విచారించి అలాంటి వారిని వెంటనే దేశం నుండి పంపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మారోజి సుధాకర్ చారి, కొలిపాక బాలరాజు, మాసిని వినోద్, సందీప్, ఏనుగంటి గౌతం, కందికట్ల వాసు, ఏశాల సూరి, యోగిరాజ్, వైద్య, వేణు, శ్రీకాంత్, చరణ్, కృష్ణ, లోకేష్ గౌడ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో వరల్డ్ యూనివర్సిటీ పోటీలకు జిల్లా క్రీడాకారిణి ఎంపిక



మిట్టపల్లి రిత్విక

నవీపేట,మే6(ఆంధ్రజ్యోతి):వచ్చేజూలై 16వ తేది నుంచి 27వ తేదీ వరకు జర్మనీ రాజధాని బెర్లిన్ నగరంలో జరిగే వరల్డ్ యూనివర్సిటీ ఛాంపియన్ షిప్-2025 స్విమ్మింగ్ పోటీలలో ఇండియా తరపున పాల్గొనడానికి నిజామాబాద్ జిల్లా క్రీడాకారిణి మిట్టపల్లి రిత్విక ఎంపికయ్యారు. మండలంలోని బినోలకు చెందిన మిట్టపల్లి రిత్విక కలింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ యూనివర్సిటీ ఒడిశా రాజధాని భువనేశ్వర్ తరపున 50 మీటర్ల బెస్ట్ స్ట్రోక్ స్విమ్మింగ్ పోటీలలో ఆల్ ఇండియాలో బంగారు పతకం సాధించి మన దేశం తరపున వరల్డ్ యూనివర్సిటీ ఛాంపియన్ షిప్-2025 పోటీలలో పాల్గొనడానికి ఆమె ఎంపికయ్యారు. స్విమ్మింగ్‌లో వరల్డ్ యూనివర్సిటి పోటీలకు ఎంపికైన మిట్టపల్లి రిత్వికను మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు,నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా,రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడిల శ్రీరాములు అభినందించారు.

బదిలీపై వెళ్తున్న అసిస్టెంట్ మేనేజర్‌కు సన్మానం



కల్లూర్‌లో అసిస్టెంట్ మేనేజర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కోటగిరి,మే6(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కల్లూర్ కెనరా బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న ఉమేష్ ఎడపల్లి బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. బ్యాంకు ఆవరణలో మంగళవారం బదిలీపై వెళ్తున్న అసిస్టెంట్ మేనేజర్ ఉమేష్‌ను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఉమేష్ రైతులకు, బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, లింగాప్ప, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యను తప్పుదోవ పట్టిస్తున్న ఇరువర్గాల గ్రామ పెద్దలు

నిజాంసాగర్, మే 6 (ఆంధ్రజ్యోతి):యువకుడి ఆత్మహత్య కేసును గ్రామపెద్దలు తప్పుదోవ పట్టిస్తూ ఆత్మహత్యకు పాల్పడితే గుండెపోటు అని చిత్రీకరించి దహనం చేసిన సంఘటన మంగళవారం నిజాంసాగర్ మండలం నర్సింగరావు పల్లి గ్రామంలో వెలుగు చూసింది. క్షణికావేశంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటే ఇరు వర్గాల పెద్దలు, రాజకీయ నాయకులు గుండెపోటుతో మృతి చెందాడంటూ బంధువులు రాక ముందే దహన సంస్కారాలు చేసి శభాష్ అనిపించుకున్న రాజకీయ నాయకులు, గ్రామస్తులు. వివరాలు ఇలాఉన్నాయి.నిజాంసాగర్ మండలం నర్సింగరావుపల్లి గ్రామంలో బొజ్జఎల్లయ్య తనయుడు ఇరువురు కలిసి సోమవారం సాయంత్రం ఇంటి వద్దనే గొడవపడ్డారు. ఒకరికొకరు తోపుకుంటూ కర్రలతో కొట్టు కున్నారు. ఇంటి పక్కనే ఉన్న సుబ్బిరి రాములు వీరి గొడవను నివారించడానికి వెళ్లగా నితీష్ రోకలిబండతో తండ్రిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. రోకలి బండతో తండ్రిని కొట్టేందుకు వెళుతున్న నితీష్‌ను నివారించేందుకు రాములు వెళ్లడంతో రోకలిబండ అతని చేయికి బలంగా తగలడంతో రాములు చేయి విరిగింది. హుటాహుటిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. తండ్రి తనయులు పడ్డ గొడవను జీర్ణించుకోలేక నితీష్ ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. గ్రామంలో ఇరు పార్టీల నాయకులు, గ్రామ ప్రముఖులు పోలీసులకు ఎలాంటి సమాచారాన్ని అందించలేకపోయారు. నితీష్, శివకుమార్‌లు కలిసి వెళ్లినందుకే మంగళవారం ఉదయం గ్రామంలో ఇరు పార్టీల నాయకులు,గ్రామపెద్దలు శివకుమార్‌పైపంచాయతీ నిర్వహించి రూ. లక్ష జరిమానా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాములుకు అందించా లని గ్రామపెద్దలు హుకుంజారీ చేశారు.నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని రహదారి పక్కన ఉన్న ఈగ్రామంలో ఈ సంఘటన జరిగిన కనీసం గ్రామ పోలీసులకు సమాచారంలేకపోవడం పట్లనిరసనలు వ్యక్తమవు తున్నాయి.

● బాన్సువాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వివరణ

బాన్సువాడరూరల్ సర్కిల్ పరిధిలోని నిజాంసాగర్ మండలం నర్సింగరావుపల్లి గ్రామంలో తండ్రి తనయులను గొడవలు క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడ విషయమై బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్‌ను వివరణ కోరగా మృత దేహాన్ని దహనం చేశారని సమాధానమిచ్చారు. ఈవిషయమై అన్నికోణాలలో పరిశోధనల జరుపుతామని ఆయన తెలిపారు.

తెలంగాణను అస్థిరపరిచేలా సీఎం మాటలు

ఆర్మూర్ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణను అస్థిరపరిచే కుట్రలో భాగమే సీఎం రేవంత్‌రెడ్డి దివాల మాటలని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. పదహారు నెలల్లోనే రేవంత్ సర్కార్ అప్పు తెచ్చిన లక్ష కోట్లు ఏమయ్యా యని ప్రశ్నించారు.అదే అధికారులు ఆదే యంత్రంగం ఉన్న ప్రభుత్వం మారగానే ఆదాయాలు ఎందుకు పడిపోయాయని ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డొంకేశ్వర్, మే 6(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మాసం చెరువు సమీపం లో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో అన్నారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మంగ్లారం పోశన్న మృతిచెందారు. నికల్‌పూర్ గ్రామం లో బందువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి స్కూటిపై వస్తుండగా అదుపు తప్పి తారురోడ్డుపై పడగా తలకు బలమైన గాయాలయ్యి అధిక రక్తస్రావం జరిగి అక్కడిక్కడే మృతిచెందినట్లు ఎస్సై చిరంజీవి తెలి పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి మృతుని భార్య మంగళారం సాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేస్తున్నామన్నారు.

కార్మిక వర్గంపై దాడికి వ్యతిరేకంగా పోరాడాలి

వేల్పూర్,మే6(ఆంధ్రజ్యోతి): మేడే మే స్పూర్తితో కార్మిక వర్గంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా పోరాడాలని టీయుసీఐ జిల్లా నాయకుడు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. వేల్పూర్‌లోని రామ్ మందిర్‌వద్ద ఏర్పాటు చేసిన 139వ మేడే ఎర్రజెండాను టీయుసీఐ జిల్లా నాయకుడు జి. అరవింద్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకురాలు సత్తెక్క, శంకర్, లక్ష్మణ్, పురుషోత్తం, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు మోర్తాడ్‌కు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే రాక

మోర్తాడ్ , మే 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం జరిగే నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి హాజరవుతున్నారని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆర్ఎస్‌బీ ఫంక్షన్‌హాల్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నలుగురు పేకాట రాయుళ్ల పట్టివేత

బోధన్‌రూరల్,మే6(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంటాఖుర్దు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేయగా నలుగురిని పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు.వారి వద్ద నుండి సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు. పేకాట ఆడినా, నిర్వహించిన చర్యలు తప్పవన్నారు.

ఆటో బోల్తా ఒకరి మృతి

నందిపేట్, మే 6(ఆంధ్రజ్యోతి):ఖుద్వాన్‌పూర్ గ్రామ శివారులో మంగళవారం ఆటో బోల్తా పడిన ఘటనలో గోక సాయన్న (65) మృతి చెందారు. పిప్రి గ్రామానికి చెందిన గోక అశోక్ తన కుటుంబ సభ్యులతో ఆటోలో ఖుద్వాన్‌పూర్ ఎల్లమ్మ దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఆటో డ్రైవర్ గట్టు సత్యనారాయణ ఆటోను అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపడంతో అదుపుతప్పి బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న గోక సాయన్న, మమత, నితిన్, లక్ష్మీ ప్రసన్నలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన గోక సాయన్న చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య

ఆలూర్ , మే 6(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండల కేంద్రంలోని ఊర చెరువులో ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మంగళవారం మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఆలూర్ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ఆంధ్రమేస్త్రీ తోడేటి నర్సింహులు(30) సోమవారం రాత్రి కాలకృత్యాలకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

రామన్నపేట్‌లో ఛత్రపతి సాహుమహరాజ్ వర్ధంతి

వేల్పూర్, మే 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని రామన్నపేట్ గ్రామం లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఛత్రపతి సాహుమహారాజ్‌కు 104వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవైఎస్ ప్రధాన కార్యదర్శి జాంబవ చామర్, ఉపాధ్యక్షుడు వినోద్, అంజయ్య, రాజన్న, పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

● ఆర్మూర్ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



మాక్లూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్ , మే 6(ఆంధ్రజ్యోతి): వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మాక్లూర్ మండల పరిసరాల గ్రామాల్లో కల్లాలలో,రోడ్లపై ఆరబోసిన వడ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులు 90రోజుల పాటు కష్టంచేసి పండించిన పంటను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం కాలయాపం చేస్తోందని విమర్శిం చారు. ప్రభుత్వం దృష్టి హైదరాబాద్‌లో నిర్వహించనున్న అందాలభామల పోటీలపై ఉందని రైతు సమస్యలపై వరివధాన్యం కొనుగోలుపై దృష్టిసారించడం లేదన్నారు. రైతు లకు కల్లాలు లేక రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్నారని తూకం వేసినప్పటికి ధాన్యం రోజుల పాటు రోడ్లపై ఉండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే రైతులతో కలిసి కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని ఆ తర్వాత జరిగే పరిణమానాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని రైతుల పక్షాన హెచ్చరిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు నూతుల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షురాలు గంగోని మమత రాజేశ్వర్, కార్యదర్శి రమేష్‌నాయక్, సురేష్‌నాయక్, గంగోని సంతోష్, గంగోని వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



మాక్లూర్, మాదాపూర్‌లలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మాక్లూర్, మే 6(ఆంధ్రజ్యోతి):అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున ధాన్యం కొనుగోల్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ నిర్వాహకులను ఆదేశించారు.మంగళవారం మండల కేంద్రంలోని మాదాపూర్,మాక్లూర్‌లలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని సకాలంలో తూకం జరిపించి నిర్ణీత సమయంలో రైస్‌మిల్లులకు తరలించాలన్నారు.ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వలు, రైస్‌మిల్లులకు పంపించిన ధాన్యం నిల్వల గురించి రైతుల ఖాతాలో జమచేసిన బిల్లుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తడిసిపోకుండా రైతులకు కార్పాలింగ్ ... అందజేయాలని అలాగే తాగునీరు, నీడవసతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.ముఖ్యంగా లారీల కొరత,హమాలీల కొరత లేకుండా చూసు కోవాలని గన్నిబ్యాగులు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, తేనేశాతం కొలిచే మీటర్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట ఆర్డీవో సాయాగౌడ్, డీసీఎం సాయిలు, తదితరులున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని చూపెడుతున్న సంఘ నాయకుడు భూమన్న

ఆర్మూర్‌టౌన్ , మే 6 (ఆంధ్ర జ్యోతి):అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూమన్న అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో తడిసిన వరిదాన్యం కుప్పలు ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిదాన్యాన్ని తేమశాతం వచ్చిన కొనుగోలుకాక రైతులు అవస్థలు పడుతున్నారని వడగండ్ల వర్షం ఎప్పుడు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మాణిక్యం, నల్లారెడ్డి, నరేష్, శ్యాం, సాయన్న, మడియాల పోశెట్టి, అగ్గు సాయన్న , తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

● రూ. 6450 స్వాధీనం, నలుగురు నిందితుల అరెస్టు


మాక్లూర్,మే 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని మానిక్‌బండార్ గ్రామంలోని చెక్కవద్ద వైన్స్ పరిమిట్ రూం ఆవరణలో పేకాట ఆడుతున్న నాలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని రూ. 6450తో పాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.మండలంలో ఎక్కడైన పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంఈవో బట్టు రాజేశ్వర్

బాల్కొండ, మే6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 10వ తేదీనుంచి 25వ తేదీ వరకు జరిగే వేసవి ఉచిత శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో బట్టు రాజేశ్వర్ సూచించారు. బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాలను 10-05-2025 నుంచి 25-05-2025 వరకు జరుగుతాయన్నారు.ప్రతీరోజు ఉద యం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ శిక్షణ శిబిరాలు ఉంటాయని, విద్యార్థులు డ్రాయింగ్, డాన్స్, క్రాఫ్ట్, కరాటే, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ తదితర అంశాలలో విద్యార్థులకు శిక్షణను ఇచ్చేలా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.

కొడిచర్లలో రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్లు

కోటగిరి,మే6(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలం లోని కొడిచర్ల మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం కోటగిరి ఎస్ఐ సునీల్ పట్టుకున్నారు. తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య

ముప్కాల్, మే 6(ఆంధ్రజ్యోతి): పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రా మంలో చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లూర్ గ్రామానికి చెందిన ఆటాక్ బాలకృష్ణ(21) కొద్ది రోజులుగా పెళ్లి కావడం లేదని బాధపడుతూ మధ్యానికి బానిసై ఈనెల 4వ తేదీన ఇంటినుంచి వెళ్లా డు. చుట్టుపక్కల గాలించిన ఆయన ఆచూకీ లభించలేదు. మంగళవారం ఎస్సారెస్పీ ప్రాజెక్టులో పడి చనిపోయున్నాడు. తండ్రి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజులు జైలు

జక్రాన్‌పల్లి , మే 6(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన పడకల్ గ్రామానికి చెందిన అప్పాల వినోద్ అనే వ్యక్తికి మంగళవారం ఆర్మూర్ ద్వితీయ శ్రేణి న్యాయాధికారి వినోద్‌కు రెండు రోజులు జైలుశిక్ష విధించినట్లు ఎస్సైమాలిక్‌రెహ్మాన్ తెలిపారు. ఈ సందర్భం గా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి ఎవ్వరుకూడా వాహనాలు నడపొద్దని చట్టరీత్యా నేరమన్నారు.



తాడ్వాయి ప్రభుత్వ కళాశాల

ప్రభుత్వ కళాశాలలో తగ్గుతున్న ఉత్తీర్ణత శాతం

- అన్ని వసతులు ఉన్నా పది శాతమే ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు
- పట్టించుకోని కళాశాల అధ్యాపకులు
- కళాశాలలో చేరడానికి నిరాసక్తి చూపుతున్న విద్యార్థులు

తాడ్వాయి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లోని అవసరమైనవన్నీ సమకూర్చుతున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. కళాశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తుంటే మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల నిర్వహణ మాత్రం అందుకు విరుద్ధంగా నడుస్తోంది. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు ఉంది ఈ కళాశాల దుస్థితి. అన్ని వసతులను సమకూర్చుతూ ప్రభుత్వం మండల కేంద్రంలో కళాశాలను ఏర్పాటు చేసింది. గత సంవత్సరం కళాశాల ఉత్తీర్ణత వంద శాతం. ఇందుకు ప్రైవేట్ లెక్చరర్లు ఎంతో శ్రమించారు. అదే కళాశాలలో ఈ సంవత్సరం ప్రభుత్వ లెక్చరర్లను ప్రభుత్వం నియమించింది. కానీ వీరి విద్యా బోధనలో పది శాతమే ఉత్తీర్ణత సాధించారు. ప్రతీ సంవత్సరం ఉత్తీర్ణత శాతం పెరగాలని కళాశాల అధ్యాపకులు చూస్తుంటారు. కానీ తాడ్వాయిలో డ్యూటీ వేసుకుని వెళ్లామా పోయామా అన్న చందంగా సాగుతోంది. విద్యార్థులకు బోధన సరిగ్గా చేయకనే ఈ సంవత్సరంలో పది శాతం ఉత్తీర్ణత వచ్చిందని ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇంత చూస్తున్నా పైఅధికారులు మాత్రం కళాశాలలను తనిఖీ చేయడం లేదు. ఒక వేళ తనిఖీ చేసిన తూతూమంత్రంగానే కొనసాగుతోంది. వేలు, లక్షల్లో వేతనాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెప్పడంలో నిర్లక్ష్యం ఏమిటని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఇలా నిర్లక్ష్యం చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని కోరుతున్నారు. పది శాతం ఉత్తీర్ణత చూసి ఈ సంవత్సరం ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు చేరే ఆసక్తి చూపడం లేదు. ఒకప్పుడు ప్రభుత్వ కళాశాలలో సీటు దొరకాలంటే చాలాకష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు ప్రకటనలు వేసి మరి ప్రభుత్వ కళాశాలలో చేరాలని అధ్యాపకులు చెబుతున్నారు. అంటే ప్రభుత్వ కళాశాలలో ఎంత వరకు దిగజారుతున్నాయో అర్థమవుతుంది. ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ బలోపేతం చేయాలని ఉద్దేశంతో అన్ని రకాల వసతులు కల్పించిన ఫలితం మాత్రం శూన్యంగా కనిపిస్తుంది. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తం 150 నుంచి 200 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి తరగతులు బోధించడానికి 15 మందికి పైగా లెక్చరర్‌లు ఉన్నారు. అన్ని సబ్జెక్టులలో సరైన పద్ధతిలో బోధించే లెక్చరర్లు ఉన్నారు. కానీ ఫలితాలు మాత్రం విరుదంగా ఉన్నాయి. కళాశాలలో మొత్తం 101మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 16 మంది ఉత్తీర్ణత సాధించారు. దీనిపై తల్లిదండ్రులు 10 శాతం ఉత్తీర్ణతపై మండిపడుతున్నారు. కానీ కళాశాలలో ఒకరిద్దరూ మాత్రం మెరుగైన ఉత్తీర్ణతను సాధించారు. ఫెయిల్ అయిన విద్యార్థులను తిరిగి సప్లమెంటరీ పరీక్ష రాసేందుకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నామని అధ్యాపకులు అంటున్నారు. కాని విద్యార్థులు మాత్రం ఎంత చెప్పినా రావడం లేదని అంటున్నారు. ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిద్దామన్న ఫోన్ నెంబర్లను బ్లాక్ లిస్టులో పెడుతున్నారని అధ్యాపకులు అంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకుని కళాశాలకు పంపించేందుకు కృషి చేయాలని అధ్యాపకులు అంటున్నారు. రాబోవు సప్లమెంటరీ పరీక్షలో ఎక్కువశాతం ఉత్తీర్ణత రావడానికి కృషిచేస్తామని వీరు ఇకనైనా కళాశాలలో మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు బోధన చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఇకనైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వకళాశాలపై దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ బడుల్లో ఆర్టిఫిషియల్ పాఠాలు!

- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఏఐ బోధన
- విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించే దిశగా సర్కారు అడుగులు

పెద్దకొడప్‌గల్, మే 6 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రభుత్వ పాఠశాలలు అంటే తెలుగు మీడియంలోనే విద్యాబోధన చేసేవారని, పిల్లలకు సరిగ్గా చదవు అందదని, తద్వారా పిల్లలకు నాణ్యమైన అందదనే అపోహ ఉండేది. కానీ నేడు పరిస్థితులు మారిపోయాయి. ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తూ ప్రయివేట్ విద్యాసంస్థలకు పోటీగా విద్యాబోధన సాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో. అంతేగాక గత రెండు సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం తెలుగు మీడియంలోనే విద్యాబోధన చేస్తారన్న అపోహను అధిగమిస్తూ ఆంగ్ల మాధ్యమంలో బోధన సాగిస్తున్నారు. ఇది చాలదన్నట్లుగా రానున్న విద్యాసంవత్సరం నుంచి జిల్లా వ్యాప్తంగా 50 మంది విద్యార్థులకు పైగా ఉన్న పాఠశాలల్లో ఏఐ (ఆర్టిఫిషియల్ విద్యాబోధన) పాఠాలు విద్యార్థులకు అందించడానికి సర్కార్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. దీంతో ఈ విద్యాసంవత్సరం జూన్ నుంచి 50మంది విద్యార్థులకు పైగా ఉన్న సర్కార్ బడుల్లో ఏఐ విద్యా బోధన అందనుంది.

ఏంటీ ఈ ఆర్టిఫిషియల్ విద్యాబోధన

విద్యార్థుల శక్తి సామర్థ్యాలు పెంచడానికి గతంలో ఉపాధ్యాయుల ద్వారా బోధన సాగేది. అయితే మారుతున్న పరిస్థితుల దృష్ట్యా వారి సామర్థ్యాలు పెంచడానికి ఏఐ ద్వారా కృతిమ విద్యాబోధన చేస్తున్నారు. ఒక రకమైన ప్రత్యేక యాప్‌తో కంప్యూటర్ ద్వారా బోధన చేయాలని సర్కార్ నిర్ణయించింది. ఇందులో భాగంగానే 50మంది విద్యార్థులు ఉన్న ప్రతీ పాఠశాలకు ఏఐ విద్యాబోధనకు అవసరమైన సౌకర్యాలను కల్పించనుంది. కంప్యూటర్లతోపాటు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పాఠశాలలకు పంపుతున్నారు. దీంతో రానున్న రోజుల్లో కంప్యూటర్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించనున్నారు. ఉపాధ్యాయులు కాకుండా కంప్యూటర్‌లో బోధన చేయడం వల్ల విద్యార్థులు తమకు తాముగా తప్పొప్పులను గుర్తిస్తూ ముందుకు సాగుతారు. అంతేగాక ఈ విద్యాబోధనలో నాలుగు రకాల యాప్‌లు జీ కంప్రయిజింగ్, కోడ్‌మిత్ర, క్విక్‌డ్రా వంటి యాప్‌లతో పాఠాలు అందించనున్నారు. గతంలో ప్రయివేట్ పాఠశాలలకు పరిమితమైన కంప్యూటర్ విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యానేర్చే చిన్నారులకు అందనుంది.



మండలంలోని బేగంపూర్ ప్రాథమిక పాఠశాల

జిల్లా అంతటా అమలు

గత విద్యాసంవత్సరం నుంచి చిన్నారులకు ఏఐ పాఠాలు అందించాలని నిర్ణయించిన అధికారులు జిల్లాలోని బోర్లం, షెట్‌పల్లి, కొమలంచ, రామారెడ్డి, బస్వాపూర్ పాఠశాలలను ఎంపిక చేసి ఏఐ విద్యాబోధన ప్రారంభించారు. దీంతో సత్ఫలితాలు విద్యార్థులకు అందుతున్నాయని గ్రహించిన సర్కార్ జిల్లాలోని 214 పాఠశాలల్లో 50 మంది విద్యార్థులు చోట ఏఐ పాఠాలు బోధించనున్నారు. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్టిఫిషియల్ విద్యాబోధనపై అవగాహన కల్గించి జూన్ నుంచి చిన్నారులకు పాఠాలు అందించనున్నారు.

ఆర్టిఫిషియల్ ద్వారా బోధన అందించనున్నారిలా..

తెలంగాణ కోడ్ మిత్ర వెబ్‌సైట్‌లో గణితానికి సంబంధించిన ఆకారాలు తయారుచేసేందుకు కోడింగ్, జ్యామితీయ సాధనాలు, గడియారంలోని కోణాలపై అవగాహన, పజిల్స్, ఆంగ్ల భాష పదాలు, సామాన్య, సాంఘిక శాస్త్రాల విషయాలపై నైపుణ్యం పెంచే అంశాలపై బోధన అందించనున్నారు. దీంతోపాటుగానే విద్యార్థుల శక్తి సామర్థ్యాలు గుర్తించి వారికి అనుగుణంగా బోధన అందించనున్నారు.



బోర్లం పాఠశాలలో ఏఐ పాఠాలు చేర్చుకుంటున్న విద్యార్థులు

పెరగనున్న విద్యార్థుల సంఖ్య

ప్రభుత్వం బడుల్లో కంప్యూటర్, ఏఐ విద్యాబోధన చేయడం ద్వారా రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మామూలుగా విద్యాబోధన కంటే కంప్యూటర్ల ద్వారా బోధన జరగనుండటంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు రావచ్చని ఉపాధ్యాయ వర్గాలు చర్చించుకుంటున్నారు. కంప్యూటర్ ద్వారా బోధన చేయడం ద్వారా విద్యార్థుల ఉచ్చరణ, కృత్యాలు మొదలైనవి బాగు పడుతుండటంతో హాజరు శాతం పెరగవచ్చని ఊహాగానాలు వినబడుతున్నాయి.



పిల్లలు ఉత్సాహంగా నేర్చుకుంటున్నారు..

• అయ్యుల సంతోష్ ఉపాధ్యాయులు బోర్లం

గతంలో మామూలుగా పాఠాలు బోధిస్తుండేవారం. అయితే గత విద్యాసంవత్సరంలో మా పాఠశాల పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక కావడంతో ఏఐ ద్వారా పాఠాలు బోధన ప్రారంభించాం. దీంతో పిల్లలు ఉత్సాహంగా పాఠాలు నేర్చుకుంటున్నారు. మామూలు పాఠాల కంటే కంప్యూటర్‌లో పాఠాలు నేర్వడం ఉత్సాహం చూపుతున్నారు. మా పాఠశాలలో 1 నుంచి 8 తరగతులు ఉండగా, ప్రతీ రోజు ఒక తరగతి విద్యార్థులకు ఏఐ పాఠాలు అందిస్తున్నాం. ఇంగ్లీషు, గణితం, కలర్స్ మ్యాచింగ్ చేయడం, కోడింగ్, డీకొడింగ్ అంశాలు నేర్పుతున్నాం.

ఏఐతో విద్యార్థుల భవిష్యత్తు మారనుంది

• ప్రవీణ్‌కుమార్ ఎంఈవో పెద్దకొడప్‌గల్

ఏఐ విద్యా ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించి అందుకు అనుగుణంగా 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఏఐ పాఠాల బోధనకు సర్వం సిద్ధం చేసింది. రానున్న విద్యా సంవత్సరం జూన్ మాసంలో ఆయా పాఠశాలలకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అందించ నుంది. రాష్ట్రస్థాయిలో జిల్లా నుంచి నలుగురికి శిక్షణ కూడా పూర్తయింది. శిక్షణ పొం దినవారు జిల్లాస్థాయిలో 27 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఏఐ విద్యాప్రాముఖ్యతతో విద్యార్థుల భవిష్యత్తు మారనుంది. చిన్నారులను వారి తల్లిదం డ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరుతున్నాం.



బీఈడీ, బీపీఈడ్ సెమిస్టర్ పరీక్షా ఫలితాల విడుదల



టీయూలో బీఈడ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

డిచ్‌పల్లి,మే6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని ఫిబ్రవరిలో జరిగిన బీఈడీ, బీపీఎడ్ 1, 3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు మంగళవారం వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి చేతుల మీదుగా విడుదల చేశారు. బీఈడీ 1వ సెమిస్టర్‌లో 1338 విద్యార్థులు పరీక్షలు రాయగా 900 మంది పరీక్షలు ఉత్తీర్ణులు అయ్యారని, 3వ సెమిస్టర్‌లో 1277 పరీక్షలు రాయగా 1169 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బీపీఈడీ 1వ సెమిస్టర్‌లో 55 మంది గాను 47మంది పరీక్షలలో ఉత్తీర్ణత సాధించారని, 3వ సెమిస్టర్ 45మందికి 44మంది ఉత్తీర్ణత పొందినట్లు కంట్రోలర్ సంపత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కంట్రోలర్ సంపత్, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ రెగ్యూలర్ 2,4,6 వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ 1,3,5 సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14నుంచి ప్రారంభమవుతాయని ఈ పరీక్షలకు 11,617 విద్యార్థులు 32సెంటర్‌లలో పరీక్షలు జరుగుతాయని పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.సంపత్ కుమార్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ లో పొందుపర్చినట్లు తెలిపారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

మోస్రా, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవూర్ గ్రామంలో గ్రామ గౌడసంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు కోనాపురం స్వామిగౌడ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఈనెల 2 నుంచి 4 వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం గడ కట్టిలందల ఎల్లయ్య ఆలయానికి వెళ్లి పూజలు చేసి గ్రామంలో ప్రధాన వీధులల్లో ఊరేగింపు చేశామని, శనివారం ఉదయం పోచమ్మ తల్లిబోనాలుచేసి అమ్మవారికి సమర్పించామన్నారు. సోమవారం రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు, పుట్ట బంగారం తీసుకుని రావడం అదే విధంగా బైండ్లవార్ వేషధారణ వేసుకుని ఏడు అంత్రాల బోనం తీశామని చెప్పారు. మంగళవారం శ్రీ రేణుకా ఎల్లమ్మతో జమదగ్ని ముని కల్యాణ మహోత్సవం జరిపించామన్నారు. కార్యక్రమంలో గ్రామగౌడ సంఘం సభ్యులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

శ్రీ నిమిషాంభ దేవి ఉత్సవాలకు ఏర్పాటు పూర్తి

బాల్కొండ, మే6(ఆంధ్రజ్యోతి): బాల్కొండలో 523 ఏళ్ల క్రితం కొలువై ఉన్న శ్రీ నిమిషాంభ దేవి ఆలయంలో వైశాఖమాసం దశమిరోజు దేవి జన్మదినాన్ని పురస్కరించుకొని ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ పూజారి బి. కృష్ణరావు జోషి తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు అమ్మవారికి అభిషేకం, లక్ష్మీగణపతి, చండీహోమం అనంతరం మహా హారతి, అనంతరం మహిళలచే ఒడిబియ్యం జరుగుతుందని తెలిపారు. పూజ అనంతరం రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎల్‌యస్ ప్రసాద్, రాజ్యలక్ష్మీ, శ్రీహర్ష, దీపిక, డా.గౌతమ్, భార్గవి, చైతన్య, కృష్ణ, వారిచే భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆలయ సేవకులు బిఆర్ నర్సింగ్ రావు తెలిపారు. ఆలయంలో ఆలయంలో 2018 ఏప్రిల్ నుంచి ప్రతినెల మొదటి శుక్రవారం అన్నదానం జరుగుతుందని తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి ప్రత్యేక నిధులచే నకాష్ సంఘం నిర్మాణం పూర్తి అయిందని, ఆలయంలో వివిధ అభివృద్ధి పనుల కోసం భక్తులు కానుకలు సమర్పించుకోవాలని నర్సింగ్ రావు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

నిజాంసాగర్ బస్టాండ్‌లో సమస్యల తిష్ఠ!

- తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రయాణికులు
- అధ్వానంగా మారిన టాయిలెట్స్
- మూన్నాళ్ల ధ్వంసమైన వాటర్‌ట్యాంక్ సంపు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నిజాంసాగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ బస్‌స్టేషన్‌లో అనేక సమస్యలు తిష్టవేశాయి. తాగునీటికీ ప్రయాణికులు అల్లాడుతున్నారు. అధికా రులు, పాలకులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతూనే ఉన్నాయి. ఈ బస్‌స్టేషన్ నుంచి వివిధ ప్రాంతా లకు ప్రయాణించే ప్రయాణికులు బస్టాండ్‌లో దాహన్ని తీర్చుకోలేక అనేక పాట్లు పడుతున్నారు. నిజాంసాగర్ మండలకేంద్రంలో 1989 లో తెలుగు గ్రామీణ ప్రాంత పథకం కింద రూ.18లక్షలతో బస్‌స్టేషన్‌ను నిర్మాణం చేశారు ఈ బస్‌స్టేషన్‌లో నాలుగు ప్లాట్‌ఫారాలను నిర్మాణం చేసి జాతికి అంకితంచేశారు. అప్పట్లో ప్రయాణికుల అత్యవస రాల కోసం మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మాణంచేసి తాగు నీటి వసతితోపాటు ప్రయాణికులు వినియోగించుకునేందుకు మరుగుదొడ్లలో నీటి వసతులు కూడా కల్పించారు. కాలక్రమేనా 1989లో వేసిన బోరు బావిలో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. అప్పటినుంచి నిజాంసాగర్ బస్‌స్టేషన్‌లో తాగు నీటి కొరత కొట్టు మిట్టాడుతూనే ఉంది. నిజాంసాగర్ బస్‌స్టేషన్ నుంచి ప్రతీరోజు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు బస్సులు వెళ్తూనే ఉంటాయి. ఈ బస్‌స్టేషన్ నుంచి దాదాపు ఐదు వేల నుంచి 8వేల మంది ప్రయాణికులు వివిధప్రాంతాలకు ప్రయాణిస్తూ ఉంటారు. ఆర్టీసీ అధికారులు, పాలకులు బస్ స్టేషన్ అభివృద్ధి పేరిట ఎంపీ లాండ్స్ కిందట రెండు లక్షలు సిడిపి నిధుల కిందట ఆరు లక్షలు, ఆర్టిసీ నిధుల కిందట లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో బస్‌స్టేషన్ ఆవరణ సీసీ నిర్మాణం పనులతోపాటు బస్‌స్టేషన్‌కు ఏర్పడ్డ పగుళ్లను మరమ్మతులు చేయడంతోపాటు విద్యుదీకరణ పనులను పునర్నిర్మానం చేశారు. కానీ ప్రయాణికులకు కనీస సౌకర్యాలవైపు కన్నెత్తి చూడలేకపోయారు. ప్రయాణికులకు బాత్ రూమ్, టాయిలెట్లు లేక అనేక పాట్లు పడుతున్నారు. అప్పట్లో నిర్మించిన టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు శిథిలావస్థకు చేరి కూలి పోయాయి. ఈ బాత్‌రూమ్‌లకు అనుసంధానంగా చేసిన సెప్టిక్ ట్యాంక్ కూడా కూలిపోయింది. ఆర్టీసీ అధికారులు బస్‌స్టేషన్ అభి వృద్ధి పేరిట లక్షల రూపాయలతో సీసీ రోడ్ నిర్మాణం పనులు చేశారే తప్ప ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోయా రు. గత ఐదేళ్ల కిందట నియోజకవర్గ నిధుల కిందట బోర్ బావిని తవ్వించి మోటార్ బిగించిన ఆర్టీసీ అధికారులు బస్‌స్టేషన్‌కు తాగునీటి వసతి కల్పించలేకపోయారు. ఈ బోరుబావి నుంచి గ్రామపంచాయతీ అధికార యంత్రాంగం నిజాంసాగర్ ప్రాజెక్టుకు వెళ్లే రహదారి సరిహద్దుల్లో వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ట్యాంకులో కూడా నీరు నింప లేక ఉన్నారు. ఈ వాటర్ ట్యాంక్ కూడా కళాహీనంగా మారినా పట్టింపు లేనట్లుగా వివరిస్తూనే ఉన్నారు. నిజాంసాగర్ బస్ స్టేషన్ సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఆర్టీసీ ఉన్నతాధికారులు పర్యవేక్షించిన బాత్‌రూమ్, టాయిలెట్‌లను నిర్మాణం చేయాలని ఆలోచన కూడా లేకపోవడం పట్ల సర్వత్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ ఉపాధిహామీ పథకం కింద బస్‌స్టేషన్‌లో బాత్ రూమ్, టాయిలెట్లను నిర్మాణం చేసేందుకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు శంకుస్థాపన చేసినప్పటికీ అవి నిర్మాణానికి నోచుకోవటం లేదు. బస్‌స్టేషన్ అభివృద్ధి పేరిట పనులు చేపట్టినా కళాహీనంగా మారి చూపరులను వెక్కిరిస్తూనే ఉన్నాయి. పాలకులు, అధికారులు ఈ బస్‌స్టేషన్‌పై కన్నెత్తి చూడటం లేదని ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల అవసరాలకు బెంచీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు తప్ప తాగునీటి మర్చిపోవడంపట్ల మండల వాసులు వాపోతున్నారు. 25 ఏళ్లుగా నిజాంసాగర్ మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ దివంగత వినయ్ కుమార్ వారి పేరిట ప్రతి సంవత్సరం అంబిలి తాగు నీటి కేంద్రాన్ని ఏర్పాటు చేసేవారు. మాజీ జెడ్పీటీసీ వినయ్ కుమార్ మృతిచెందడంతో కుటుంబసభ్యులు అంబిలి తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. వేసవిలో ఆర్టీసీ అధికారులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన మూన్నాళ్లకే చలివేంద్రం మూత పడిపోయింది. చలివేంద్రంలో ఉన్న రంజన్లు కంట్రోలర్ గదిలో అటకెక్కాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు రాష్ట్ర జిల్లాలోనే ఎంతో ప్రాముఖ్యత సంచరించుకున్న అప్పటికి నిజాంసాగర్ బస్‌స్టేషన్ సమస్యల వలయంలో సతమతము అవుతున్న పట్టించుకోలేక పట్టించుకునే నాధుడు కరువయ్యారని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్ స్టేషన్ ఆవరణలోనే ఎమ్మెల్యే నిధులు కింద బోరు బావి తవ్వించి మోటార్ బిగించిన ఆర్టీసీ అధికారులు వాటర్ ట్యాంక్‌తోపాటు బాత్‌రూమ్‌లో కుళాయిలు ఏర్పాటు చేయకపోవడం విశేషం. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం స్పందించి తాగునీటి వసతితో పాటు ప్రయాణికుల అవసరాలకు బాత్‌రూమ్, టాయిలెట్లను నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నిజాంసాగర్ బస్‌స్టేషన్ ఇదే..



శిథిలావస్థకు చేరిన బాత్ రూమ్‌లు, టాయిలెట్లు



బస్‌స్టేషన్ ఆవరణలో కూలిపోయిన సెప్టిక్ ట్యాంకు



ప్రారంభించిన మూన్నాళ్లకే మూతపడ్డ చలివేంద్రం



షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సినీతార నేహాశెట్టి

ఎల్‌వీఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

● సందడి చేసిన సినీతార నెహాశెట్టి

ఆర్మూర్ రూరల్ , మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో మంగళవారం ఎల్‌వీఆర్ షాపింగ్‌మాల్‌ను సినీతార నెహాశెట్టి ప్రారంభించారు. షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి అధిక సంఖ్యలో హాజరైన ప్రజలకు సినీనటి నెహాశెట్టి అభివాదం చేసి అందరినీ ఉత్సాహపరిచేలా మాట్లాడారు. తాను గతంలో నిర్మల్‌లో ప్రారంభించిన ఎల్‌వీఆర్ షాపింగ్‌మాల్ విజయవంతంగా నడుస్తుందని, అదే విధంగా ఆర్మూర్‌లో తాను ప్రారంభించిన ఎల్‌వీఆర్ షాపింగ్ మాల్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి, వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, షాపింగ్ మాల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాస్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ముబారక్‌నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముబారక్‌నగర్ ఫీడర్ పరిధిలోని లక్ష్మిప్రియనగర్, భాగ్యనగర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్, జనప్రియనగర్, ఏకశీలనగర్‌లో ఉదయం 9 నుంచి 12.30ల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

20న సార్వత్రిక సమ్మె

మోపాల్, మే 6 (ఆంధ్రజ్యోతి):కార్మికుల మెడకు ఉరితాడు లాంటి 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాములు డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లాలో ఆర్‌టీవో కార్యాలయంలో ఇంచార్జి డీటీవో రాహుల్‌కుమార్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న ఆటో, ట్రాలీ, డీసీఎం, లారీ, మినీ డీసీఎం, టాటాఏసీ, ట్రాక్టర్, అంబులెన్స్, స్కూల్ బస్సులు, ట్రక్, వరికోత మిషన్‌లు, జేసీబీ, బోరు బండి, టూరిస్ట్ బస్సులు, ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్‌లందరూ పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముజీబ్, సయ్యద్ రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నిజామాబాద్ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి):కేంద్రంలో బీజేపీ మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమల్లో భాగంగా 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 20న నిర్వహించతలపెట్టిన ఒక్కరోజు సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, రైతు సంఘ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ మార్కెట్ బిల్లును రద్దు చేయాలి

సిరికొండ, మే 6 (ఆంధ్రజ్యోతి):రైతు సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేసి కనీస మద్దతు ధర చట్టాన్ని అమలు చేయాలని ఏఐయుకేఎస్ నాయకులు మంగళవారం తహశీల్దార్ రవీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయకార్యదర్శి రమేష్, రైతుసంఘం నాయకులు లింబన్న, నారాగౌడ్, రమేష్, సాయరెడ్డి, కిశోర్, అనీష్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులపై పనిభారం తగ్గించాలి

సుభాష్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులపై పనిభారం తగ్గించాలని, ఖాళీగా ఉన్న ఆపరేటర్ పోస్టులను భర్తీచేయాలని సీఐటీయు కార్యదర్శి నూర్జహాన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరి సింగిరెడ్డి చంద్రరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పవర్ హౌజ్ కార్యాలయంలో సుపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరేష్, గంగాధర్, ప్రభాకర్, మురళీ, తది థామస్ తరులు పాల్గొన్నారు.

చిలుకల చిన్నమ్మ ఆలయంలో దొంగతనం

మోపాల్, మే 6 (ఆంధ్రజ్యోతి):రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముదక్‌పల్లి గ్రామంలో ఉన్న చిలుకల చిన్నమ్మ ఆలయంలో గుర్తుతెలియని దొంగలు చొరబడి ఆలయంలో ఉన్న హుండీని పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నింధితుల కోసం గాలిస్తున్నామని ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఈ ఆలయంలో ఇప్పటికీ రెండు మూడు సార్లు దొంగతనాలు జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు నింధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలిసినవారే ఆలయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు పోలీసులకు వివరించారు.

సీఎం వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

● పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులు చెల్లించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు తపస్, డీటీఎఫ్, పీఆర్‌టీయూ సంఘాలు వేరువేరుగా సమావేశాలు నిర్వహించి సీఎం వ్యాఖ్యలను తప్పుపట్టాయి. ఉద్యోగ, ఉపాధ్యా యుల పెండింగ్ బిల్లులు, డీఏలపై సీఎం వైఖరి ఆక్షేపనీయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, కిషన్‌లు అన్నారు. మంగళవారం జిల్లా పీఆర్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయులు తమ సర్వీసులో చేరినప్పటి నుంచి తమ పిల్లల చదు వులు, పెళ్లిళ్లు, వైద్య ఖర్చుల కోసం తమ జీతం నుంచి నెలనెలా ప్రభుత్వం వద్ద జమ చేసుకున్న జీపీఎస్ డబ్బులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ బిల్లులు, సప్లిమెంటరీ బిల్లులు రెండేళ్లుగా రావడం లేదన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగ ఉపాధ్యాయుల గ్రాడ్యుటీ, కమ్యూటేషన్, సరెండర్ డబ్బులు రావడం లేద ని న్యాయంగా రావాల్సినవి తప్ప బోనస్‌లు, ఉచితాలు అడగడం లేదని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేసినందునే కాంగ్రెస్‌ను గెలిపించుకున్నామన్నారు. సమావేశంలో నాయకులు అశోక్, శ్రీనివాస్, సాయరెడ్డి, నగేష్‌రెడ్డి, గోపి, వరప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు బాధాకరం..

ఉద్యోగ ఉపాధ్యాయులపై సీఎం వ్యాఖ్యలు బాధాకరమని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, భద్రినాథ్‌లు అన్నారు. మంగళవారం తపస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ జీతాల నుంచి జమ చేసుకున్న డబ్బులను మాత్రమే అడుగుతున్నారని వారి హక్కుల కోసమే పోరాడుతున్నారని వెంటనే పెండింగ్‌లో ఉన్న డీఏతో పాటు అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు.

సీఎం వ్యాఖ్యలు అనుచితం...

సుమారు రెండేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించవల్సిన అనేక రకాల బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ అన్నారు. గతంలో సీఎం జేఏసీ నాయకులతో సమావేశం సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరితే సీఎం మాట్లాడిన తీరు అనుచితం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బాలయ్య, ఓమాజీ, దాసు, పెంటన్న, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రుణాలు

(ఐదో పేజీ తరువాయి)

దీనిపై దశల వారీగా పరిశీలించిన అధికారులు జిల్లా ప్రతినిధులతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఇతర అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకు న్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదా రులు మహిళా గ్రూపుల్లో సభ్యులైతే వారికి ఇళ్ల నిర్మాణం చేసుకు నేందుకు 50వేల వరకు రుణం ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పరిధిలో ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ఏపీఎంలు, డీపీఎంలతో పాటు ఆ శాఖ అధికారులు గుర్తించి వారు ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా ప్రోత్సహించనున్నారు. వారికి బ్యాంకుల నుంచి 50వేల వరకు రుణం ఇప్పించడంతో పాటు విడతల వారీగా చెల్లించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నా రు. జిల్లాలో ఇందిరమ్మ లబ్ధిదారులుగా ఉన్న మహిళా గ్రూపు సభ్యులకు రుణాన్ని అందించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ తెలిపారు. అర్హులైన వారిని గుర్తించి 50వేల వరకు రుణాలు ఇప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు.

సెట్-2025 ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ అమలు

● సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల సెట్- 2025లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద అండర్ సెక్షన్ 163 బీఎన్ఎస్ అమల్లో ఉండనున్నట్లు పోలీస్ కమీషనర్ సాయి చైతన్య తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీ డియెట్ ప్రవేశాల కోసం ఈనెల 10వ తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30ల వరకు జరుగనున్న ప్రవేశ పరీక్ష జరిగే పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా 163 బీఎన్ఎస్ అమల్లో ఉండనున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కడ కూడా అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా నిరోధించాలనే ఉద్దేశ్యంతో ఈ సెక్షన్‌ను అమలు చేయనున్నట్లు సీపీ తెలిపారు. అండర్ సెక్షన్ 163 బీఎన్ఎస్ ప్రకారం ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద గుమ్మిగూడరాదని, నిషేధిత వ్యక్తులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగవద్దని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అన్ని జిరాక్స్‌సెంటర్లను ఉదయం 7గంటలనుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మూసి వేయాలన్నారు.

దుబ్బాకలో పోలీసుల కవాతు

ధర్పల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని దుబ్బాక గ్రామంలో మంగళవారం సీఐ భిక్షపతి, ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో పోలీసు కవాతు జరిగింది. అనంతరం సీఐ మాట్లాడుతూ దొంగతనాలు జరుగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు. విద్యార్థులకు పాఠశాలల సెలవులు ఉన్నందున చెరువులు, బావుల వద్దకు ఒంటరిగా ఈతకు పంపరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామస్తుల్లో భయాందోళనలు తొలగించడానికి కవాతు నిర్వహించినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

జిల్లాలో రాబోయే ఐదు రోజుల్లో..

● ఉరుములు, మెరుపులతో తేలికపాటి వర్షం పడే అవకాశం

నిజామాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో ఉరుములు, మెరు పులు, ఈదురు గాలులతో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన, శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. ఈ ఐదు రోజుల పాటు గాలులు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపారు. ఈనెల 7న బుధవారం జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాలోని ఆదిలా బాద్, నిర్మల్, కామారెడ్డి, మంచిర్యాల, కొమరంభీమ్, ఆసీఫాబాద్ జిల్లాల పరిధిలో వడగండ్ల వాన, ఉరుములు, మెరుపులు, పిడుగులతో కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉందని తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు. ఇప్పటికే పంట కోసి ఎండబెడుతున్న రైతు లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ధాన్యం ఎండితే సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పరస్పర ఫిర్యాదులు

● ట్రాఫిక్ ఏసీపీపై బదిలీ వేటు

● అవినీతి ఆరోపణల నేపథ్యంలో డీజీపీ కార్యాలయానికి అటాచ్

నిజామాబాద్‌అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణపై పోలీస్ ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. నూతన ఏసీపీగా సీటీసీలో ఉన్న మస్తాన్ అలీకి బాధ్యతలు అప్పగించారు. నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో బదిలీ జరుగగా పోలీస్ కమీషనరేట్ పరిధిలో చర్చనీయాంశమైంది. నిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై పరస్పర ఫిర్యాదులు రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి వెళ్లడంతో ఉన్నతాధికారులు ఏసీపీపై చర్యలు తీసుకున్నారు. నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీగా పనిచేస్తున్న నారాయణపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. నిజామాబాద్ సీపీగా బాధ్యతలు చేపట్టిన సాయిచైతన్య ట్రాఫిక్ ఉల్లంఘనల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ ప్రతీరోజు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనాల తనిఖీల పేరుతో నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ముసుగులో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో వసూళ్ల విషయంలో ఇద్దరు అధికారుల మధ్య వివాదం తారాస్థాయికి చేరుకొని ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో ఈ విషయంపై సీపీ స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. నివేదిక ఆధారంగా డీజీపీ కార్యాలయం ట్రాఫిక్ ఏసీపీపై బదిలీ వేటు వేసింది. ఆయనను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంలో మరో ఒకరిద్దరిపై చర్యలు ఉండే అవకాశాలు ఉన్నాయి. నగరంలో మొరం, ఇసుక తరలించే వాహనాలను అనుమతించవద్దనే నిబంధనలు ఉన్నా ఇష్టారాజ్యంగా నగరంలో అనుమతించినట్లు తెలుస్తుంది. ట్రాఫిక్ విభాగంలో ఏసీపీ తీరుపై పలువురు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఆయనను బదిలీ చేసినట్లు తెలుస్తుంది. వచ్చే ఆగస్టులో రిటైర్డ్‌మెంట్ కానున్న ఏసీపీ ఇదే అదనుగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏసీపీ బదిలీతో ట్రాఫిక్ విభాగం ప్రక్షాళన అవుతుందో లేదంటే మరికొంత మందిపై చర్యలు ఉంటాయో వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. నగరంలో వాహనదారులపై ఎడాపెడా జరిమానాలు వేసే ట్రాఫిక్ పోలీసు విభాగాన్ని ప్రక్షాళన చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

చెరువులో పడి మహిళ మృతి

జక్రాన్‌పల్లి,మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోనిపడకల్ గ్రామానికిచెందిన మెండే సాయమ్మ(59) మంగళవారం రాత్రి పెద్ద చె రువులో పడి మృతి చెందినట్లు ఎస్సై మాలిక్ రెహమాన్ తెలిపారు. చెరువులో నుంఇచ మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె చెరువులో పడి మృతి చెందడానికి గల కారణాలు తెలియరాలేదని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

10 నుంచి 25 వరకు విద్యార్థులకు శిక్షణ శిబిరం

సిరికొండ,మే6(ఆంధ్రజ్యోతి):సిరికొండ మండల కేంద్రంలో ఈనెల 10 నుంచి 25 వరకు డ్యాన్స్, కరాటే, యోగా, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇవ్వనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బి.రాములు తెలిపారు. మంగళవారం నుండి 10వ తేదీ వరకు విద్యార్థుల అడ్మిషన్ తీసుకోవాలని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆయన కోరారు. అడ్మిషన్ చేసేటప్పుడు ఆధార్ జిరాక్స్ తప్పనిసరి అని ఆయన సూచించారు. ఈ శిక్షణ శిబిరంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 100 మందికి శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో రాములు తెలిపారు.

'స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి'

ఇందల్వాయి, మే 6 (ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు లోలం సత్యనారాయణ అన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ ఆదేశాల మేరకు మండలంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలను మంగళవారం నియమించారు. పార్టీ సీనియర్ కార్యకర్తలు సమిష్టిగా పనిచే యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు నాయిడి రాజన్న, అన్సాన్‌పల్లి వాసు, కన్నె చిన్ని, లక్ష్మినారాయణ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం(బి),బర్దిపూర్ గ్రామాల్లో విద్యుత్ భద్రత వారోత్సవాలు



ధర్మారంలో మాట్లాడుతున్న ఏడీఈ బాలేష్ కుమార్

డిచ్‌పల్లి,మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా ధర్మారం(బి), బర్దిపూర్ గ్రామాల్లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బాలేశ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే వినియోగదారులు సొంతంగా మరమ్మత్తులు చేసుకోకుండా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని వినియోగదారులను కోరారు. ప్రమాదాలు తమకు ఆందోళనను ఆవేదనను కల్గిస్తున్నాయని అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు నివారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ మోహినుద్దిన్, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్‌నాంపల్లి, లైన్‌ఇన్స్‌పెక్టర్ నవీన్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్పల్లి:మండల కేంద్రంలో మంగళవారం డిచ్‌పల్లి ఏడీఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యుత్ భద్రత వారోత్సవా లను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి విద్యుత్ సమస్యలు ఎదురైనా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా వారు వివరించారు. సొంతంగా వినియోగదారులు మరమ్మతులు చేసుకోవచ్చని ప్రమాదాలకు గురికాకుండా ఉండాలన్నారు. విద్యుత్ సమస్య ఎదురైతే 1912కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించాలన్నారు. వెంటనే విద్యుత్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ నాగేశ్వర్, సబ్ ఇంజనీర్ గౌతమ్, విద్యుత్ సిబ్బంది రవీందర్, అశోక్, మనసు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పనిభద్రత కోసం పోరాడుదాం

నిజామాబాద్ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి):ప్రపంచ కార్మికులందరూ కార్మిక హక్కుల పని భద్రత కోసం పోరాడాలని బీవోసీ రాష్ట్ర నాయకుడు నర్సింగ్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ద్వారకనగర్‌లో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మేడే కార్యక్రమంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో రోజురోజుకి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మిక వేతనాలు పెంచడం యాజమాన్యుల బాధ్యత అని అన్నారు. కార్మికుల శ్రమను దోచుకుంటూ పనిభద్రత లేని పరిస్థితి తెస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు పనిభద్రత కల్పించాలని కార్మికుల హక్కుల కోసం ప్రతి ఒక్క కార్మికుడు సిద్ధం కావాలని అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వాలు తీసుకునే ప్రతీ నిర్ణయాన్ని కార్మికులపై రుద్దడం సమంజసం కాదని అన్నారు. కార్మికులకు పక్కా ఇళ్లు, ఇంటి నిర్మాణం కోసం స్థలాలను కేటాయించాలని, నిధులు అందించే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా, ఐఎఫ్‌టియు నగర కార్యదర్శి శివకుమార్, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, పీవైఎల్ భాస్కర్, శంకర్, శాంతమ్మ, అశోక్, చంద్రశేఖర్, యాదమ్మ, మల్లమ్మ, లక్ష్మి తదిరులు పాల్గొన్నారు.